# "అత్తా - కోడలు"

శ్రీ సోమంచి రామం, B.Sc

వెంకమ్మ : అత్తగారు. శారద : కోడలు.

సత్యం : కొడుకు.

వెంకమ్మ : శారదా!

(దూరం నుంచి "వస్తున్నా నత్తయ్యా" అని సమాధానం.)

వెం : (కోపంగ) ఎక్కడ ఛస్తున్నావ్!

శారద : (దగ్గరగ) పిలిచారా అత్తయ్యా?

వెం : ఎన్ని సార్లరచినా పలకవేం బెల్లం కొట్టిన రాయిలా!

శా : వస్తున్నా నంటూనే ఉన్నా మీరు పిలుస్తూనే ఉన్నారు!

వెం : నేను పిలుస్తున్నానని తెలుసుగదా!

శా : అందుకే గదండి వచ్చింది!

వెం : వచ్చి మళ్లీ నంగనాచిలా "పిలిచారా అత్తయ్యా" అంటావేం? ఏం గడుసు దానివే!

శా : ఇంతకు ఎందుకు పిలిచారత్తయ్యా!

వెం : ఏం అవతల అర్జంటు మండిపోతోందా?

శా : అబ్బబ్బ! పొద్దున్నే ఎందుకండీ గోల?

వెం : గోలకాదుమరీ! నువ్వు ఆడిందల్లాఆట పాడిందల్లా పాటగ సాగనిస్తే మంచిదాన్ని లేదూ గోలచేసే దాన్ని- ఏం నేర్చావే!

: క్షమించండత్తయ్యా! పొరపాటయింది. పిలిచిన పనేమిటో చెప్పండి!

వెం : పొరపాటయింది కాబట్టే అనుకోవడం! జరగని దాని గురించి అనుకోవడ మెందుకు? విసుగ్గా ఉంటే ఫో! నేనే ఛస్తా!

శా : ఇప్పుడు నే నేమన్నానని! అంత రాద్ధాంతం?

వెం : నామాటలన్నీ రాద్ధాంత సిద్ధాంతాలా? రోజులు మారిపోయాయి! నా కొడుకు చేతగాని వాడు. చెవులట్టుకుని ఆడిస్తున్నావు!

శా : అదేంమాట అత్తయ్యా! ఆయన వింటే?

వెం : ఏమనుకుంటాడు? తన చేతకాని తనానికి కంటతడి పెట్టాడు.

శా : ఇప్పుడవన్నీ యెందుకండి? పిలిచిన పనేమిటో చెప్పండి!

వెం : ఏమీలేదు! బియ్యం కొలవమన్నాను కొలిచావా!

శా : లేదు! కొలిచి తెస్తా నుండండి!

వెం : ఆ! నువ్వెందుకు తెస్తావు! నా మాట నీకు లెక్కా!

శా : పూజ చేసికొని తెద్దామనుకున్నాను. ఇంతలో ఆయ నొచ్చారు. దాంతో-

వెం : ఈ లోకమే మర్చిపోయావు! ఈ అత్తముండ కేకెయ్యబట్టి యిక తప్పదని వచ్చావు!

శా : సరేలెండి! అయిపోయిన దానిగురించెందుకు?

వెం : ఇదిగో! ఇలారా! ఈ గిన్నె చూడు (గిన్నె నేలకేసి కొట్టిన శబ్దం) దీన్ని ఎంత అంటుందో! ఆపని చేసేది తోమాక తోలుస్తావా? అన్నింటికీ నేనే చావాలి! లేకపోతేలేదు! ఎందాక ఈ కొంపలో వేగ గలను?

శా : చూడలేనట్టుం దత్తయ్యా!

వెం : ఎందుకు చూస్తావ్! నీకేం పట్టింది అత్తముండ ఉంది యింట్లో ఉడకేసి పడేసేందుకు! దాసీముండ ఉంది ఖాళీ అయిన అంట గిన్నెలు తోమడాన్కి! ఇంక నీకేంపని హాయిగా కాలిమీద కాలేసికొని కూర్చుని తింటావు!

శా : ఎందుకొచ్చిన సాధింపులండీ యివన్నీ పొద్దున్నే!

వెం : నువ్వు రాణీవి నిక్కి నీలిగి ఎనిమిదింటికి లేస్తావు నీకు యిది పొద్దున్నలా ఉంది. ఆ శ్రీమన్నారాయణుడు కనిపించి అప్పుడే మూడు గంటలయింది.

నీకేం! చీకా చింతా! రాత్రి 8 గం||లకు పడుకుంటావ్! పొద్దున 8 గం||లకు లేస్తావు!

శా : ఆగిన్నె యిలా యివ్వండి తోలుచుకొస్తాను.

వెం : ఇదిగో యిష్టముంటే రోజూ తోలుస్తూండు. లేక పోతే నేనే తగలడతాను.

శా : అల్లాంటూ రేమిటత్తయ్యా! రోజూ తోలవటంలా! ఇవ్వాళే ఏదో పొరపాటయింది.

వెం : పొరపాటు కాదు. నా గ్రహపాటు. తెలిసిందా!

శా : అత్తయ్యా! మీరు అనవసరంగా కోపం తెచ్చుకుని ఆవేశపడుతున్నారు!

వెం : అయ్యో! అయ్యో! నా కనవసరంగ కోపం వచ్చిందా! నువ్వేం ఎరగవేం?

శా : ఇప్పుడు నేనేం చేశానండీ మీకు అంత కోపం!

వెం : ఈ రభస చాలదూ! అత్తముండ చెప్పిందికదా చేద్దాము అని లేదుకదా! వెధవపనులు చేసి పొర పాటు అయిందనడం నేర్చావు!

శా : (విసుగ్గా) అత్తయ్యా!

వెం : ఏం కొట్టావా ఏం? మావాడు వట్టి వాజమ్మ కాబట్టి నా బ్రతుకు బజారు పాలైంది. ఆయనే బ్రతికుంటే నీచేత యిన్ని మాటలనిపించుకునే దాన్నా! ఇదంతా నా ఖర్మం.

శా : ఎందుకత్తయ్యా! ఆ గొడవలన్నీ! ఆయన వచ్చారు!

వెం : వచ్చాడా! పాపం! ఎంత దూరం తిరిగాడో కాసిని మంచినీళ్ళయినా యిచ్చావా? ఈ ఉద్యోగం కాదుకాని పిల్లాడు హూనమై పోతున్నాడు. వేళకు తిండీ తిప్పలు లేక ఎండ వాననక మొండిగ తిరుగుతున్నాడు. ఏ ముహూర్తాన కాలు పెట్టావో అమ్మతల్లివి! వాడికి ఉద్యోగం దొరకడమే అపురూపమైపోతోంది!

శా : ఏమిటిదంతా అత్తయ్యా!

వెం : నీలాంటి వాళ్లు యింట్లో ఉంటే వేరే శని రా నక్కరలేదు. నువ్వు రానంతకాలము మావాడు చురుకుగా ఉండేవాడు! నువ్వు వచ్చావు! పిచ్చి వాడిలా తయారయాడు! నన్నిలా సాధించి చంపుతున్నావు!

శా : అత్తగారూ! మీకో దణ్ణం. ఊరుకోండి. ఆయన ఏమన్నా అంటారు.

వెం : వింటే యేం! నిజం చెప్తే నిష్టూరంట! అలాగ! పోనీలే! అర్ధాంగివి నిన్నే మీ అనడుగా! ఎటొచ్చీ అమ్మను నేనుంటాను ఎదురుగా! ఆనాలుగు అక్షింతలు నా మీదవేస్తాడు. పోనీలే నా ఖర్మ! (అని ఏడుస్తుంది)

సత్యం : (ప్రవేశిస్తూ) అబ్బబ్బ! ఏమిటే గోల!

వెం : (ఏడుస్తూ) నాయనా! నీకూ గోలే అనిపించిందా! ఆవిడ అందంటే తప్పా! అద్దాలాన్నదే బిడ్డలు గాని గద్దాలాన్నదా? ఇంతకూ ఆయనుండగా నా ప్రాణం పోక పోవటం నా ఖర్మం!

స : ఇంతకూ ఏం జరిగిందమ్మా!

వెం : ఏదైనా జరుగుతుంది! ఎంత చెడ్డా అదీ నువ్వూ ఒకటి! ఎటొచ్చీ వేరయింది నేనొక్కత్తెను!

శా : అదికాదండి!

స : ఛట్! నువ్వూరుకో!

శా : నే నేమన్నానండీ అంత కోపం!

స : నోర్ముయ్యమన్నా!

వెం : ఎందుకు మూస్తుంది! ఉద్యోగం లేనివాడివని చేతకాని వాడివని నువ్వంటే దానికి అలుసు. నీమాట దానికి లెక్కా. నాయనా! నామాట చెప్పనే అక్కరలేదు! పోనీ అత్తముండనాయె! నాకింత సహాయం చేయటంలేదు! నాతో వాదన!

శా : అత్తయ్యా ఏమిటా మాటలు?

స : నోర్ముయ్ (అని చెంపమీద కొట్టాడు)

శా : అమ్మా! (ఏడుస్తూ వెళ్ళిపోతుంది)

స : ఛీ! ఒక్కనిమిషం శాంతి లేదీకొంపలో! ఎ నేపు పంతాలతో పడి కొట్టుకు ఛస్తారు. ఎక్క కన్నా పోదామన్నా—

వెం : ఎలా ఉంటుంది నాయనా శాంతి!

స : ఊరుకోవమ్మా! అయిపోయిందిగా! యింకెందుకు!

వెం : ఊరుకోక ఏంచేస్తానాయనా! దిక్కులేనిదాన్నయి పోయాక! నా ఖర్మం! ఆయనుంటే నాకీ తిప్పలు ఉండేవా! ఇంతకీ నిన్నన వలసిన పనేముందిలే! (అని లోనికి పోవును)

స : ఇటు చూస్తే యీ గోల! అటు చూస్తే ఆ గోల! పగవాడికైనా వద్దురా ఇలాంటి సంసారం!